హైస్కూళ్ల పనివేళల్లో మార్పు

- ఇకపై 9 నుంచి 4.15 గంటల వరకే
- జంటనగరాల్లో మాత్రం యథావిధిగా

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పనివేళల్లో స్వల్ప మార్పులు చేస్తూ విద్యాశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక నుంచి ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పని చేయనున్నాయి. ఇంతకు ముందు హైస్కూళ్లు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పని చేశాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు యథావిధిగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు, హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో కూడా యథావిధిగా ఉదయం 8.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతాయి. ట్రాఫిక్ కారణాల దృష్ట్యా హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో పాఠశాలల సమయాన్ని మార్చలేదని ఉత్తర్వులో పేర్కొన్నారు.

డీఎస్సీకి 84% మంది హాజరు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న డీఎస్సీ ప్రశాంతంగా జరుగుతున్నట్టు పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి తెలిపారు. మూడోరోజు శనివారం నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలకు 84 శాతం మంది హాజరైనట్టు పేర్కొన్నారు. 3,504 మందికి 2,931 మంది హాజరయ్యారని, 573 మంది(16శాతం) మంది గైర్హాజరయ్యారని వివరించారు. 11,062 టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది.

'విద్యుత్తు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించండి'

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు రంగంలో సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఉద్యోగులకు వెంటనే ప్రమోషన్లు కల్పించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. ప్రమోషన్ల కోసం ఏడేండ్లుగా ఎదురుచూస్తున్నారని తెలిపింది. శనివారం జేఏసీ కన్వీనర్ ఎన్ శివాజీ, కో చైర్మన్ పీ అంజయ్య ఆధ్వర్యంలో సభ్యులు టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీతో సమావేశమయ్యారు. 30 ఏండ్ల సర్వీసు చేసి సీనియారిటీ ఉండి కూడా ఓ ఉద్యోగి ప్రమోషన్ లేకుండా రిటైర్డ్ కావడం బాధాకరమని వాపోయారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఎండీకి అందజేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు రామేశ్వర్ శెట్టి, నాజర్‌షరీఫ్, కరెంట్‌రావు, పీఎం రాజు, రామకృష్ణారెడ్డి, కే వెంకటేశ్, రాజేశ్, లక్ష్మయ్య, అక్బర్ పాల్గొన్నారు.

'ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోండి'

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 20: అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు ఆజాద్ మాట్లాడుతూ.. కొన్ని ఇంజినీరింగ్ కళాశాలలు మాఫియాలా వ్యవహరిస్తూ, ఒక్కో సీటును రూ.16 లక్షల నుంచి రూ.25 లక్షలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు.

గన్ మిస్‌ఫైర్.. సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి

పటాన్‌చెరు, జూలై 20 : గన్ మిస్ ఫైర్ అయి సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. బీడీఎల్ పోలీసులు తెలిపిన వివరాలు.. పటాన్‌చెరు మండలం భానూర్ పరిధిలోని బీడీఎల్ పరిశ్రమ బందోబస్తు బాధ్యతలను సీఐఎస్ఎఫ్ నిర్వహిస్తున్నది. టౌన్‌షిప్‌లో నివసిస్తున్న పెట్నికోట వెంకటేశ్వర్లు(32) సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. బీడీఎల్‌లోని వాచ్‌టవర్ నంబర్-4లో వెంకటేశ్వర్లు రాత్రి డ్యూటీ చేశాడు. తెల్లవారుజామున డ్యూటీ ముగించుకుని యూనిట్ లైన్ బ్యారక్‌లో బస్సు దిగే క్రమంలో అతని వద్ద ఉన్న గన్ ప్రమాదవశాత్తు పేలడంతో బుల్లెట్ నేరుగా వెంకటేశ్వర్లు తలలో నుంచి బయటకు వెళ్లింది. వెంకటేశ్వర్లును చికిత్స కోసం టౌన్‌షిప్‌లోని దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. నంద్యాల జిల్లాకు చెందిన వెంకటేశ్వర్లు 2012లో సీఐఎస్ఎఫ్‌లో చేరాడు. ఇతను ఏడాదిన్నరగా బీడీఎల్ భానూర్ యూనిట్ రక్షణ విధులు నిర్వహిస్తున్నాడు.

నేరం చేయకున్నా నిందితుడే!

- సైబర్ నేరాల్లో ప్రమేయం లేకున్నా ఫ్రీజవుతున్న అమాయకుల బ్యాంకు ఖాతాలు
- అన్‌ఫ్రీజ్ ఎలా చేయాలో తెలియక ఇబ్బందులు
- పోలీసుల వద్దకు వెళ్లాలని బ్యాంకుల సూచనలు
- మెయిల్‌కు స్పందించని సైబర్ సెక్యూరిటీ బ్యూరోలు



హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): ఎవరో చేసిన తప్పు.. మరెవరికో ముప్పు తెస్తున్నది. సైబర్ నేరాల్లో ప్రమేయం లేకున్నా, నేరంలో తాను బాధితుడు కాకున్నా కొందరు నిందితులుగా మారుతున్న పరిస్థితులు తలెత్తుతున్నాయి. తమ ఖాతాలకు ఎవరో డబ్బులు పంపితే.. వారిపై ఇంకెవరో ఫిర్యాదు చేస్తే వీరి అకౌంట్లు స్తంభించిపోతున్నాయి. ఇలా చాలామంది అకౌంట్లు ఫ్రీజ్ కాగా వాటిని తిరిగి ఎలా కొనసాగించాలో తెలియక సతమతమవుతున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్‌యాప్స్, రమ్మీ గేమ్స్, ఫ్రీ ఫైర్, పబ్జీ వంటి ఆన్‌లైన్ గేమ్స్ నిర్వహిస్తున్న చైనా, ఇతర దేశాల సైబర్ ముఠాలు, ముగ్గులోకి లాగేందుకు ముందుగా ఎంతోకొంత ఖాతాల్లో జమచేయడం, అలా జమైనవారు ఆ డబ్బును తమ అవసరాలకు ఇతరుల ఖాతాలకు పంపుతుండడంతో సంబంధం లేనివారి అకౌంట్లను సైబర్ క్రైమ్ పోలీసులు స్తంభింపజేస్తున్నారు. బాధితులు ఖాతాల నుంచి ఎక్కువ మొత్తంలో నష్టపోవద్దనే సదుద్దేశంతో ఇలా స్తంభింపజేసినా వాటిని యాక్టివేట్/అన్‌ఫ్రీజ్/అన్‌హోల్డ్ చేయడంలో మాత్రం త్వరగా స్పందించడం లేదు. ముఖ్యంగా చిరువ్యాపారులు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఏం చేయాలో 'పాలు'పోక..

ఖమ్మం జిల్లా కలకోటకు చెందిన యువకుడు యంగల నాగరాజు పాల వ్యాపారం చేస్తుంటాడు. రెండు నెలల క్రితం పాల డబ్బులు ఇవ్వాల్సిన ఓ వ్యక్తి నుంచి అతని ఖాతాకు రూ.5వేలు జమయ్యాయి. సరిగ్గా జూన్ చివరి వారంలో డబ్బులన్నీ లెక్కచెప్పాల్సి ఉండగా అతని అకౌంట్ ఫ్రీజ్ అయినట్టు మెసేజ్ వచ్చింది. తీరా గ్రామీణ వికాస్ బ్యాంకుకు వెళ్తే అకౌంట్ ఎందుకు ఫ్రీజ్ అయిందో మూడ్రోజుల్లో చెబుతామన్నారు. ఆ తర్వాత వెళ్తే.. సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌కు వెళ్లాలని సలహా ఇచ్చారు. ఏం జరిగిందో తెలియక పోలీసుల వద్దకు వెళ్తే వారు ఏదో సైబర్ నేరంలో అకౌంట్ ఫ్రీజ్ అయిందని రెండ్రోజుల తర్వాత చెప్పారు. అప్పటికే నాగరాజు బ్యాంకు వివరాలు పరిశీలించిన సైబర్ క్రైమ్ పోలీసులు, అతను ఎలాంటి సైబర్ నేరానికి పాల్పడలేదని గుర్తించి ఏ రాష్ట్రానికి చెందిన సైబర్ క్రైమ్ పోలీసులు తన బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేశారో వారిని మెయిల్, ఫోన్ ద్వారా లేదా ప్రత్యక్షంగా కలవాలని వారం తర్వాత చెప్పారు. అతని అకౌంట్ ఎక్కడో పశ్చిమ బెంగాల్‌లోని సైబర్ క్రైమ్ పోలీసులు ఫ్రీజ్ చేసినట్టు చెప్పారు. ఎందుకు అని సైబర్ క్రైమ్ పోలీసుల ద్వారా అడుగగా నాగరాజుకు రూ.5వేలు పంపిన వ్యక్తికి ఆ డబ్బులు ఓ ఆన్‌లైన్ గేమ్‌లో రావడం, ఆ డబ్బులకు చైనా లింక్ ఉండటంతో అతను డబ్బు ఎవరెవరికి పంపాడో వారి ఖాతాలన్నీ స్తంభింపజేశారు. ఎక్కడో మారు మూల గ్రామాల్లో పాలమ్ముకునే తాను చేసిన తప్పంటి? అని నాగరాజు వాపోతున్నాడు.

ఇతర రాష్ట్రాలకు వెళ్లలేని పరిస్థితి..

ఇలా సంబంధం లేని కేసుల్లో ఇరుక్కుంటున్న వారిలో మధ్యతరగతి వారే అధికంగా ఉన్నట్టు సైబర్ సెక్యూరిటీ పోలీసులు చెబుతున్నారు. బాధితులు ఇలాంటి సమస్యలు వారికి చెప్పుకుంటే.. 'మీరు నిందితులు కాదని తెలుసు. కానీ మీ అకౌంట్ ఫ్రీజ్ చేసిన పోలీసులు మిమ్మలను నిందితులనే నమ్ముతున్నారు' అని చెబుతున్నారు. 'నిందితుల తరపున మీరెలా మాట్లాడతారు?' అంటూ తమతో వాదిస్తున్నారని వాపోతున్నారు. దీంతో ఏ రాష్ట్రానికి చెందిన సైబర్ క్రైమ్ పోలీసులు అకౌంట్లను ఫ్రీజ్ చేశారో అక్కడికే వెళ్లి గోడు వెళ్లబోసుకోండని చెబుతున్నారు. ఎక్కడో మారుమూల గ్రామాల్లో పాల వ్యాపారం చేసుకునే యువకుడు తాను చేయని నేరానికి మరెక్కడో ఉన్న పశ్చిమ బెంగాల్‌కు వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇలాంటి బాధితుల పట్ల కేంద్ర సైబర్ సెక్యూరిటీ విభాగం సకాలంలో నిర్ణయం తీసుకుంటేనే తాము ఏదైనా చేయగలమని రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు చెబుతున్నారు.

పాఠశాల విద్యకు మంగళ మే!

- అంగన్‌వాడీల్లోనే 3వ తరగతి వరకు నిర్వహణపై ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): అంగన్‌వాడీ కేంద్రాల్లోనే 3వ తరగతి వరకు అంటే ప్రభుత్వ పాఠశాల విద్యకు మంగళం పాడటమేనని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. నూతన విద్యావిధానం-2020ను అమలుచేస్తున్నారా? అని ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్లేస్కూళ్లుగా మార్చి కేజీ నుంచి 3వ తరగతి వరకు చదువు చెప్తామని సీఎం చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కేజీ తరగతులు లేక తల్లిదండ్రులు, 3-5 ఏండ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు కాకుండా ప్రైవేటు ప్లే స్కూళ్లకు పంపుతున్నారని తెలిపారు. దీంతో ప్రాథమిక పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ గణనీయంగా తగ్గిపోతున్నదని శనివారం ఒక ప్రకటనలో వాపోయారు. ప్రాథమిక పాఠశాలల్లోనే కేజీ తరగతులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. విద్యను ప్రైవేటీకరించేందుకు కేంద్రం నూతన విద్యావిధానం అమలుచేస్తున్నదని ఆరోపించారు.

'అంగన్‌వాడీ' ఆలోచనను విరమించుకోవాలి

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): అంగన్‌వాడీలను ప్లేస్కూల్స్‌గా మార్చి 3వ తరగతి వరకు నిర్వహించాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన సరి కాదని యూటీఎఫ్ పేర్కొంది. అంగన్‌వాడీలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా తల్లిదండ్రులు గుర్తించనందున 1,2,3 తరగతులను ఆ కేంద్రాలకు అప్పగించటం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల మూసివేతకే దోహదపడుతుందని అభిప్రాయపడింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోనే పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని ఆ సంఘం అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి రవి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలనే ప్రతిపాదన ఆహ్వానించతగినదని పేర్కొన్నారు.

'317 జీవో' క్యాబినెట్ సబ్‌కమిటీకి కన్సల్టెంట్

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): జీవో 317, జీవో 46పై క్యాబినెట్ సబ్ కమిటీకి ప్రభుత్వం కన్సల్టెంట్‌ను నియమించింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీ వెంకటేశ్వర్‌రావును కన్సల్టెంట్‌గా నియమిస్తూ సీఎస్ శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబుతో కూడిన కమిటీకి ఆయన సలహాదారుగా వ్యవహరించనున్నారు. సబ్ కమిటీ సోమవారం భేటీ అయ్యే అవకాశం ఉన్నదని అధికార వర్గాలు తెలిపాయి.

7 కోట్ల విలువైన హెరాయిన్ పట్టివేత

- రాజస్థాన్ కేంద్రంగా హైదరాబాద్‌కు సరఫరా
- నలుగురు నిందితుల అరెస్టు

కేసు వివరాలు వెల్లడిస్తున్న అవినాశ్ మహంతి

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 20 (నమస్తే తెలంగాణ): రాజస్థాన్ కేంద్రంగా హైదరాబాద్‌లో డ్రగ్స్ దందా నడుపుతున్న నలుగురు సభ్యుల ముఠాను మాదాపూర్ పోలీసులతో కలిసి సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద రూ.7 కోట్ల విలువ చేసే ఒక కిలో స్వచ్ఛమైన హెరాయిన్, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి గచ్చిబౌలిలోని పోలీస్ కమిషనరేట్‌లో మీడియాతో వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన సంతోష్ ఆచార్య విదేశాల నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి పలు ప్రాంతాలకు సరఫరా చేస్తాడు. అతడి వద్ద నేమిచంద్ భాటి, నర్పట్‌సింగ్ డ్రగ్స్ కొనుగోలు చేసి అజయ్‌భాటి, హరీశ్ సిర్విత్తో వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తారు. ఈ క్రమంలో రెండున్నర నెలల కిందట నేమిచంద్ హైదరాబాద్‌కు వచ్చి తన బావమరిది అయిన అజయ్‌భాటి, అతడి స్నేహితుడు హరీశ్ సిర్విత్తో హెరాయిన్ అమ్మకాల గురించి చర్చించాడు. వారిద్దరు ఓకే చెప్పటంతో డ్రగ్స్ కోసం రాజస్థాన్ వెళ్లాడు. తిరిగి హెరాయిన్‌ను చిన్న ప్యాకెట్లలో పౌడర్ రూపంలో ప్యాక్ చేసి నర్పట్‌సింగ్‌తో కలిసి ప్రైవేట్ బస్సులో నగరానికి చేరుకున్నాడు. అజయ్‌భాటి, హరీశ్ సిర్విని కలిసి డ్రగ్స్ విక్రయించేందుకు ప్రయత్నించగా.. అప్పటికే నిఘా పెట్టిన ఎస్‌వోటీ డీసీపీ డీ శ్రీనివాస్ తన బృందంతో వీరిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్టు చేశారు. అయితే, ప్రధాన డ్రగ్స్ సరఫరాదారు అయిన సంతోష్ ఆచార్య ఇప్పటికే డ్రగ్స్ కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్నా.. తన అనుచరుల ద్వారా విక్రయాలు చేపడుతున్నాడని సీపీ మహంతి తెలిపారు. పట్టుబడిన హెరాయిన్ స్వచ్ఛమైనదని, ఇది ఒక గ్రాము రూ.7 వేలకు పైగా ఉంటుందని వెల్లడించారు. నిందితులు నగరంలో ఎవరికి విక్రయించారన్నదానిపై విచారణ జరుపుతున్నామని చెప్పారు. సంతోష్ ఆచార్యను అదుపులోకి తీసుకుంటే మరిన్ని వివరాలు తెలుస్తాయని అన్నారు. కేసు ఛేదించిన శంషాబాద్ ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్ బృందం, మాదాపూర్ పోలీసులను సీపీ అభినందించారు. అటు.. డీజీపీ జితేందర్ కూడా పోలీస్ బృందాన్ని అభినందించారు. డ్రగ్స్‌ను అరికట్టడంలో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని పోలీసులకు సూచించారు.

ముంబై పోలీసులమని 3.40 లక్షలు టోకరా

ఎదులాపురం, జూలై 20 : ముంబై పోలీసులమని చెప్పి 3.40 లక్షలు టోకరా వేశారు. ఆదిలాబాద్‌లోని టీచర్‌కాలనీ నివాసి అయిన రిమ్స్‌లో పీజీ చదువుతున్న వైద్య విద్యార్థినికి 12న గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. 'మేము ముంబై పోలీసు లం.. మీ ఫోన్ ఐడీ వేరొకరి పేరిట ఉన్నది. ఆ ఐడీపై నేరాల కేసులు ఉన్నాయి. వెంటనే మీ ఫోన్ ఐడీతో బ్యాంకులో ఉన్న మొత్తం డబ్బును మేము చెప్పిన నంబర్‌కు పంపించాలి' అని భయపెట్టించారు. వైద్య విద్యార్థిని వారు చెప్పిన ఖాతాకు రూ.3.40 లక్ష లు బదిలీ చేసింది. అనంతరం ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని భావించి అదేరోజు సైబర్ క్రైమ్1930 నంబర్‌కు ఫిర్యాదు చేసింది. స్పందించిన సైబర్ క్రైమ్ పోలీసులు అప్పటికప్పుడు రూ.లక్ష మాత్రం ఫ్రీజ్ చేయించగలిగారు.

ఉద్యోగాల పేరిట మోసం

అనంతపూర్‌కు చెందిన ఐదుగురి అరెస్ట్

రాజన్న సిరిసిల్ల, జూలై 20 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగాల పేరిట వల వేసి.. ఒక్కొక్కరి నుంచి పదివేల దాకా వసూలు చేసి నిరుద్యోగులను మోసం చేస్తున్న ఐదుగురు అంతర్రాష్ట్ర నిందితులను సిరిసిల్ల పోలీసులు అరెస్ట్ చేశారు. సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహజన్ శనివారం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏపీలోని అనంతపూర్‌కు చెందిన ఎర్రబద్ది గోపి.. 'ట్రాన్స్జ్ ఇండియా కార్పొరేషన్ నెట్‌వర్క్' పేరిట కంపెనీ ఏర్పాటు చేశాడు. దానికోసం ఓ లోకల్ యాప్ కూడా తయారు చేయించాడు. అందులో పని చేయడం కోసం అనంతపూర్‌కు చెందిన కురుబ అశోక్‌కుమార్, మాదిగ బ్రహ్మేంద్ర, సత్యసాయి పుట్టపర్తి జిల్లాకు చెందిన మాదిగ స్వాతి, కురుబ వరలక్ష్మిని చేర్చుకున్నాడు. హెల్త్‌కేర్, పర్సనల్ కేర్, హోం కేర్, ఫ్యాషన్ వేర్, గోల్డ్ అండ్ డైమండ్‌కు సంబంధించిన వస్తువులను నేరుగా వినియోగదారులకు విక్రయిస్తామని, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఆశ చూపి లింక్‌లు పంపించాడు. ఒక్కొక్కరి వద్ద రూ.10వేల చొప్పున వసూలు చేసి కంపెనీ ఐడీ ఇచ్చాడు. మరికొంత మందిని కంపెనీలో చేర్పిస్తే కమీషన్ వస్తుందని నమ్మించాడు. ఇలా నిరుద్యోగులను మల్టీ లెవెల్ మార్కెటింగ్ కంపెనీలో చేర్చుకుంటూ పెద్ద మొత్తంలో కమీషన్ పొందాడు. వీరి ప్రకటనలను నమ్మిన సిరిసిల్లకు చెందిన దూస రమ్య తనకు ఉద్యోగం కావాలని మేసేజ్ చేసింది. అందుకు గోపి స్పందించి ఉద్యోగం ఇస్తామని చెప్పి దాదాపు రూ.10 పదివేలకుపైనే వసూలు చేశాడు. తీరా మోసపోయానని గ్రహించిన ఆమె ఇటీవల సిరిసిల్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసునమోదు చేసిన సైబర్ పోలీసులు విచారణ చేపట్టారు. ఏపీలోని అనంతపూర్‌లో ఆ ఐదుగురు నిందితులను శుక్రవారం అదుపులోకి తీసుకుని, అరెస్ట్ చేసి సిరిసిల్లకు తీసుకొచ్చారు. ఈ కంపెనీపై పదికి పైగా ఫిర్యాదులున్నట్టు ఎస్పీ తెలిపారు.

రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులు

- ఆర్టీసీ పనితీరుపై సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో శనివారం ఆయన ఆర్టీసీ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీలోని ఆయా విభాగాల పనితీరు, మహాలక్ష్మి పథకం అమలు, కొత్త బస్సుల కొనుగోలు, ఆర్థిక అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి పథకాన్ని సమర్థంగా అమలుచేస్తున్న సిబ్బందిని మంత్రి అభినందించారు. శుక్రవారం నాటికి 68.60 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకుని, రూ.2350 కోట్లు ఆదా చేసుకున్నారని చెప్పారు. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు, జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు ఇప్పుడున్న సర్వీసుల కంటే మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. 3,035 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నదని చెప్పారు. ఆర్పీఎస్ బాండ్లకు సంబంధించిన రూ.200 కోట్లను త్వరలోనే విడుదల చేస్తామని చెప్పారు. ఈ ఏడాది 38 డిపోలు లాభాల్లో ఉన్నాయని, కార్గో సేవలను విస్తరించేందుకు రిటైర్డ్ ఉద్యోగుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సంస్థ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో రోజూ సగటున 30 లక్షల మంది మహిళలు క్షేమంగా ప్రయాణిస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే సంస్థ బిలియన్ డాలర్ (రూ.8500 కోట్లు) టర్నోవర్ కార్పొరేషన్‌గా అవతరించబోతున్నదన్నారు. సమీక్షలో సంస్థ సీవోవో రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, పురుషోత్తం, వినోద్‌కుమార్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప పాల్గొన్నారు.

లంచం తీసుకుంటే ఉద్యోగం ఊడగొట్టాలి

- కఠిన చర్యల్లేకే రెచ్చిపోతున్న లంచావతారులు
- ఎక్స్ వేదికగా లంచాధికారులపై నెటిజన్ల ఫైర్
- ఏకీభవిస్తున్నానని స్పందించిన ఏసీబీ డీజీ ఆనంద్

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): లంచం అడగాలంటేనే హడల్ పుట్టాలి.. రెండు సార్లు లంచం తీసుకుంటూ పట్టుబడితే ఉద్యోగాన్నే ఊడగొట్టాలి.. దీనికోసం కఠిన చట్టాలు రావాలి.. అంటూ పలువురు నెటిజన్లు ఎక్స్ వేదికగా స్పందించారు. ఏసీబీ డీజీ సీవీ ఆనంద్‌ను ట్యాగ్ చేస్తూ పలువురు అభిప్రాయాలను పంచుకున్నారు. కఠిన చట్టాలు లేకపోవడంతోనే లంచాధికారులు రెచ్చిపోతున్నారని నెటిజన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కఠిన చట్టాలుంటే మరోసారి డబ్బు తీసుకునేందుకు అధికారులు వెనుకాడతారని అభిప్రాయపడ్డారు. ఈ విషయాలను ఉదహరిస్తూ ఏసీబీ డీజీ సీవీ ఆనంద్‌ను ట్యాగ్ చేయగా.. ఆయన 'అందుకు పూర్తిగా అంగీకరిస్తున్నాను' అంటూ తన అభిప్రాయం వెలిబుచ్చారు. ప్రజలకే సేవ చేయాల్సిన ప్రభుత్వ అధికారులు లంచాల పేరుతో సామాన్యులను పీడిస్తే కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలు రావల్సిన ఆవశ్యకత ఉందని సీవీ ఆనంద్ అభిప్రాయపడ్డారు. సుధాకర్ ఉడుముల అనే సీనియర్ జర్నలిస్టు.. సూర్యాపేట జిల్లా మత్స్యశాఖ అధికారి ఠాకూర్ రూపేందర్‌సింగ్ తాజా వ్యవహారాన్ని ఉదహరించారు. ఇటీవల ఆయన రూ.25 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నది. ఆయన ఇలా దొరకడం ఇది మూడోసారి కావడంతో జర్నలిస్టులు సహా పలువురు కొత్త చట్టాలు రావల్సిన ఆవశ్యకతను వెలిబుచ్చారు. 'ఇప్పటికే ఠాకూర్ రూపేందర్ సింగ్‌ను మూడోసారి ఏసీబీ సిబ్బంది పట్టుకున్నారు. అయినా అతనిపై ఎలాంటి చర్యలు లేవు. సగం వేతనంతో 6 నెలలపాటు సస్పెండ్ చేస్తారేమో. ఆ తర్వాత మళ్లీ అతను ఇలాగే లంచాల కోసం ప్రజలను వేధిస్తూనే ఉంటాడు' అంటూ ఆవేదనను వ్యక్తం చేశారు. ఇందుకు సీవీ ఆనంద్ స్పందిస్తూ.. 'కొన్ని చట్టాలు సున్నితమైనవి, మరికొన్ని పరిమితికి లోబడి ఉన్నాయి. ఏం చేస్తాం' అంటూ రీ పోస్టు చేశారు. ఇందుకు దేవరాజ్ అనే నెటిజన్ స్పందిస్తూ కఠిన చట్టాలు రావాల్సిందేనని తెలిపారు. తానూ ఏకీభవిస్తున్నట్టు సీవీ ఆనంద్ సమాధానం ఇచ్చారు. ఇకనైనా ప్రభుత్వం కఠిన చట్టాలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాజకీయ విశ్లేషకులు, సామాన్యులెందరో అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో సమ్మక్క ప్రధాన పూజారి మృతి

ముత్తయ్య (ఫైల్)

తాడ్వాయి, జూలై 20: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క దేవత ప్రధాన పూజారి మల్లెల ముత్తయ్య (50) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈయన పలు దవాఖానల్లో చికిత్స పొందాడు. ఇటీవల ఇంటికి వచ్చిన ముత్తయ్య శుక్రవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించేందుకు ప్రయత్నిస్తుండగా శనివారం తెల్లవారుజామున ఇంటి వద్దనే మృతి చెందాడు. ముత్తయ్యకు భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

ఆర్టీసీ యూనియన్లను పునరుద్ధరించాలి

- ట్రేడ్ యూనియన్ల సమావేశంలో ఆర్టీసీ కార్మిక నేతలు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): టీఎస్ ఆర్టీసీలోని అన్ని కార్మిక సంఘాల ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని, ఈ మేరకు లేబర్ కమిషనర్‌కు ఈ నెల 24లోపు లేఖలు అందజేయాలని వివిధ కార్మిక సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో శనివారం జరిగిన ట్రేడ్ యూనియన్ల సమావేశంలో ఈయూ నేతలతో పాటు థామస్‌రెడ్డి (టీఎంయూ), జీఆర్ రెడ్డి (ఎస్‌డబ్ల్యూఎఫ్), ఎండీ మౌలానా (ఎన్ ఎంయూ) తదితరులు మాట్లాడారు. అన్ని ట్రేడ్ యూనియన్